ఫ్యాన్ జోరు సైకిల్ బేజారు

■ తూర్పులో వైఎస్సార్‌సీపీకి ప్రజా ఆదరణ
■ పాదయాత్ర, సిద్ధం సభలతో ఆ పార్టీ అభ్యర్థి ఎంవీవీ ప్రజలతో మమేకం
■ నీరసించిన సైకిల్.. టీడీపీకి ఎదురు గాలి

ఎంవీవీకి ప్రజా మద్దతు



మాట తియ్యదనం.. మనసు మల్లెదనం
మాటిస్తే తప్పని నైజం..
సేవా తత్పరుడు.. కష్టం వస్తే పలికే వ్యక్తి
విద్య, వైద్యానికి సాయం
నియోజకవర్గంలో
కోట్లాది రూపాయలతో అభివృద్ధి
నీతి,నిజాయితీ ఆయనకు ఆభరణం
అవినీతి, అక్రమాలకు దూరం
అతడే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి
ఎంవీవీ సత్యనారాయణ..

వెలగపూడి ఎదురీత



ప్రజల మాట వినే తీరక ఉండదు
తన మాట వినకపోతే
దారికితెచ్చుకునే వరకు వదలడు
పదిహేనేళ్లుగా ఎమెల్యేగా ఉన్నా..
నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు
అక్రమాలు.. భూకబ్జాలు, సారా
వ్యాపారం.. అవినీతి, బెదిరింపులు..
ఇవే ఆయనకు తెలిసిన పాలన
నీతి, నిజాయితీకి అర్థం తెలియనివాడు
ప్రస్తుత ఎన్నికల్లో సైకిల్ తొక్కలేక
ఆపసోపాలు.. ప్రజలు ఛీకొట్టినా
నిసిగ్గుగా మళ్లీ ఓట్ల అభ్యర్థన
అతడే.. టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి..

తూర్పు నియోజకవర్గంలో 'ఫ్యాన్' గాలి గట్టిగా వీస్తోంది. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎదురులేని టీడీపీకి ఇప్పుడు ఎదురు గాలి వీస్తోంది. ఏ ప్రజలైతే వరుసగా మూడు సార్లు పట్టం కట్టారో అదే ప్రజలు రెండు రోజుల్లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీకి ఉద్వాసన పలకడానికి సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు. గతంలో రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు మళ్లీ అమలు కాని హామీలు ఇస్తున్న చంద్రబాబుపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 15 వార్డులున్నాయి. ఆరిలోవ నుంచి విశాలాక్షినగర్‌తో పాటు అటు మద్దిలపాలెం, ఇటు జాలరిపేట మీదుగా వాల్తేరు, రామ్‌నగర్ వరకు వ్యాపించి ఉంది. తూర్పు నియోజకవర్గం 2009లో ఏర్పడినప్పటి నుంచి జరిగిన మూడు సాధారణ ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబు విజయం సాధించారు. దీంతో ఇప్పుడు జరుగుతున్న నాలుగో సాధారణ ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. టీడీపీని ఎదిరించే దీటైన అభ్యర్థిగా ఎంవీవీ సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ రంగంలోకి దింపింది. ఆయన కూడా పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు దగ్గరయ్యారు. కార్పొరేషన్ ఎన్నికల్లో మెజార్టీ వార్డుల్లో ఆ పార్టీ సత్తా చాటింది. దీంతో టీడీపీ నాయకుల్లో నైరాశ్యం నెలకొంది. ఈసారి సాధారణ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం అప్పటి నుంచే ఆ పార్టీని వెంటాడుతోంది.

– ఆరిలోవ

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ దూకుడు

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ దూకుడుగా వ్యవహరించింది. అన్ని వార్డుల్లో ఆ పార్టీ కార్యకర్తలు ఐదేళ్లలో ఠంచన్‌గా అమలు చేసిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. వాడవాడలా ప్రజలు ఆ పార్టీ నాయకులకు బ్రహ్మరథం పడుతున్నారు. టీడీపీ నాయకులు చేసేది చెప్పుకోవడానికి లేకపోవడంతో ఆరోపణలకే పరిమితమయ్యారు. దీంతో ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదురయ్యాయి. ఎక్కడికి వెళ్లినా ప్రజలు తిరస్కరిస్తుండడంతో టీడీపీ నాయకులు ఈ సారి ఓటమి తప్పదని బేజారెత్తిపోతున్నారు.

'సిద్ధం' సభలకు విశేష స్పందన

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్ని వార్డుల్లోనూ ఇప్పటి వరకు సుమారు 50 సిద్ధం సభలు నిర్వహించారు. ఆయా సభల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. వాటి వల్ల కలిగే లబ్ధిని గుర్తు చేశారు. మళ్లీ ఆ పథకాలు అమలు కావాలంటే వైఎస్ జగనే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతో ఉందో వివరించారు. దీంతో అన్ని సిద్ధం సభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

కలిసొచ్చిన సీఎం జగన్ బస్ యాత్ర

ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సిద్ధం బస్ యాత్ర నియోజకవర్గం మీదుగా సాగింది. ఈ యాత్రలో ముఖ్యమంత్రి నేరుగా ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తలను కలవడం, వారిని ఆప్యాయంగా పలకరించడంతో మరింత జోష్ పెరిగింది. ఆ ఉత్సాహంతో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి దూసుకుపోయాయి.

ఎంవీవీకి కుల సంఘాల దన్ను

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ నియోజకవర్గంలో ఉన్న కాపు, బ్రాహ్మణ, వైశ్య, యాదవ, శిష్టకరణం, క్రైస్తవ, ముస్లిం తదితర కుల సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. స్నేహ పూర్వకంగా జరిగిన ఆయా సమావేశాల్లో ఆయా సంఘాలు మద్దతు ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ బలం పుంజుకొంది. మరో వైపు ఆయా సంఘాలతో టీడీపీ అంటీ ముట్టనట్టు వ్యవహరించడంతో ఎంవీవీకి కలిసొచ్చింది.

ఐదేళ్లలో అభివృద్ధి, సమస్యల పరిష్కారం

గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలు తెలుసుకొని అధికారులతో మాట్లాడి పరిష్కరింపజేశారు. వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రజలకు చేరువలో వైద్య సేవలు, విద్య, తాగునీరు, రోడ్లు, కాలువల నిర్మాణాలు, తదితర అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజల మన్ననలు పొందారు. ఇది పార్టీకి మంచి బలంగా మారింది.

మేనిఫెస్టోల విశ్వసనీయతపై బేరేజు

ఇటీవల వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలు విడుదల చేశాయి. వీటిపై ప్రజల్లో విపరీతంగా చర్చ సాగింది. సీఎం వైఎస్ జగన్ నవరత్నాలు ప్లస్ పేరిట మేనిఫెస్టో ప్రకటించగా.. టీడీపీ అధినేత చంద్రబాబు వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలనే కాపీ కొడుతూ సూపర్ సిక్స్ అంటూ మోసపూరితమైన మేనిఫెస్టో విడుదల చేశారు. వైఎస్ జగన్ మాటకు కట్టుబడి పథకాలను పక్కాగా అమలు చేసి మేనిఫెస్టోకు విలువ పెంచారు. అదే చంద్రబాబు గతంలో తన హయాంలో మేనిఫెస్టోను అమలు చేసిన దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో ప్రకటించి గెలిచాక చెత్త బుట్టలో వేసిన ఘటనలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని విమర్శలు గుప్పించిన చంద్రబాబు.. ఇప్పుడు అమలు కానీ హామీలు ప్రకటించడంపై విద్యావేత్తలు, ఆర్థిక నిపుణులు మండిపడుతున్నారు. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఈ పరిణామాలతో తూర్పులో టీడీపీకి ఎదురు గాలి తప్పదని ఆ పార్టీ నాయకులే బాహాటంగా చెబుతుండడం గమనార్హం. ఏది ఏమైనా తూర్పులో మార్పు తప్పదనే సంకేతాలు బలంగా ఉన్నాయి.

ఐదేళ్లు ముఖం చాటేసిన వెలగపూడి

2019 నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యే వెలగపూడి నియోజకవర్గంలో ప్రజలకు ముఖం చూపలేదు. ఏ సమస్య ఉందో తెలుసుకోవడానికి మచ్చుకైనా ప్రజలను పలకరించలేదు. కరోనా వంటి కష్ట సమయంలో కూడా గడప దాటి నియోజకవర్గంలో అడుగు పెట్టిన దాఖలాలు లేవు. తన సొంత వ్యాపారాలు చేసుకోవడంలోనే ఆయన తలమునకలయ్యారు. దీంతో ప్రజలు వెలగపూడిపై నమ్మకాన్ని వదులుకున్నారు. ప్రజలకు దూరంగా ఉండే ఆయన కంటే నిత్యం ప్రజలతో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ మేలంటూ నిర్ణయానికి వచ్చారు.

క్లుప్తంగా

'చంద్రబాబుది బూటకపు మేనిఫెస్టో'



మాట్లాడుతున్న కులిడి సురేష్‌బాబు

బీచ్ రోడ్డు: రావణాసురుడికి పది తలకాయలు ఉన్నట్టుగా చంద్రబాబు అందరిని పోగుచేసుకొని తన బూటకపు మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు అన్నారు. సిరిపురంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా విలయ తాండవం చేస్తున్న సమయంలో రాష్ట్రం వదిలి పక్క రాష్ట్రానికి పారిపోయిన చంద్రబాబు.. ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఉన్నవి లేనట్టుగా.. లేనివి ఉన్నట్టుగా తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను దగా చేసేందుకు బాబు అండ్ కో నిమగ్నమైపోయారన్నారు. 2014లో ఇదే కూటమి ఇచ్చిన హామీలలో కనీసం 10 శాతం కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ ఓట్లు అడగటానికి సిగ్గు లేదా? బాబు అని ఆయన ప్రశ్నించారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వల్ల ప్రజల భూములకు సంపూర్ణ రక్షణ లభిస్తుందన్నారు. దీనిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ సభ్యులు శ్రీహరి, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు ఘన నివాళి



నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : సమాజ సేవకురాలు, నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని కేజీహెచ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీ, చీఫ్ డైటీషియన్ హెచ్. రమణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మౌళి, హెడ్ నర్సులు డి.లక్ష్మి, పి.వరలక్ష్మి, ప్రశాంతి, ఉషారాణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



ర్యాలీ సందర్భంగా పార్టీ శ్రేణుల కోలాహలం



18వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ముళ్లపూడి నాగజ్యోతి, తదితరులు

ఎంవీపీ కాలనీ: ప్రజా సేవే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న ఎంవీవీ సత్యనారాయణను గెలిపించాలని ఎంవీవీ సతీమణి ముళ్లపూడి నాగజ్యోతి, కుమారుడు శరత్ కోరారు. ప్రచారానికి ఆఖరి రోజు అయిన శనివారం తూర్పు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. 9, 18, 20, 22 వార్డుల్లో అట్టహాసంగా ఈ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీని గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఓటరూ ఎమ్మెల్యేగా గెలిచినట్లేనన్నారు. తూర్పు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ఎంవీవీ సేవలు అందిస్తారన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇల్లు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా విప్లవాత్మక మార్పు తెచ్చాయన్నారు. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లు ఇదే ఒరవడి కొనసాగాలంటే రాష్ట్రంలో మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీ బొత్స ఝాన్సీని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ చందర్, పార్టీ 20వ వార్డు నాయకుడు ముష్వల సురేష్, పలువురు డైరెక్టర్లు, మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం ముగియడంతో శనివారం రాత్రి 9 గంటల సమయంలో ప్రశాంతంగా భోజనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, జీవీ, తదితరులు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు.

ఎంవీవీని ఆశీర్వదించండి



12వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నేటి సుబ్బారెడ్డి, కార్యకర్తలు



13వ వార్డులో మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత



16వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రచారం ఆఖరి రోజు శనివారం కూడా జోరుగా సాగింది. ఆరిలోవ ప్రాంతంలో ఆ పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం చేశారు. జీవీఎంసీ 9వ వార్డులో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అడ్డాల కృపాజ్యోతి, నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. 12వ వార్డు దుర్గానగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో మహిళలు ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు మద్దతుగా జీవీఎంసీ 16వ వార్డులో శనివారం ఆ పార్టీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



తోటగరువు హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద వేసిన టెంట్లు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం సాధారణ ఎన్నికలకు సిద్ధమైంది. ఎన్నికల అధికారులు ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను కొద్ది రోజులుగా చేపడుతున్నారు. నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పోలింగ్ కేంద్రాలలో బెంచీలు, టేబుళ్లు, ఫ్యాన్‌లు, ట్యూబ్ లైట్లు అమర్చారు. కేంద్రాల ముందు ఓటర్లకు నీడ కోసం టెంట్‌లు వేశారు. వైద్య సిబ్బంది, తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అదనంగా పోలీసులను నియమించారు. 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా తగిన జాగ్రత్తలు చేపడుతున్నారు. ఎండ తగలకుండా వంద మంది ఓటర్లకు నీడనిచ్చేలా కేంద్రాల ముందు టెంట్లు వేసి, సౌకర్యాలు కల్పించినట్లు ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు.

మొత్తం బూత్‌లు 293

నియోజకవర్గంలో 282 బూత్‌లున్నాయి(పోలింగ్ స్టేషన్‌లు). వాటికి మరో 11 అనుబంధ బూత్‌లు జత చేశారు. నియోజకవర్గంలో జోన్-2 పరిధి 49 ప్రాంతాలలో 95 బూత్‌లు, జోన్-3 పరిధి 59 ప్రాంతాలలో 178 బూత్‌లు ఉండగా.. జోన్-4 పరిధి 9 ప్రాంతాలలో 20 బూత్‌లు ఉన్నాయి.

11 సమస్యాత్మక ప్రాంతాలు

నియోజకవర్గంలో 11 సమస్యాత్మక ప్రాంతాలను ఎన్నికల అధికారులు గుర్తించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 5, ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో 4, ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయి. ఆయా చోట్ల ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తు నియమించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చినవాల్తేరులో 2, రాంనగర్‌లో సదరన్ స్కూల్, టింపనీ స్కూల్, ఏయూ స్కూల్, ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ కాలనీ, తోటగరువు, గాంధీనగర్, జోడుగుళ్లపాలెం, ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దిలపాలెం తారామసీదు, జాలరిపేట సమస్యాత్మక ప్రాంతాల వద్ద అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొత్తం ఓటర్లు 2,92,206 మంది

తూర్పు నియోజకవర్గంలో 2,92,206 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,42,540 మంది.. మహిళా ఓటర్లు 1,49,646 మంది ఉన్నారు. మరో 20 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు.

ఓటర్లకు అవగాహన

నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో 16 మంది సెక్టోరల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో కొత్తగా నమోదైన ఓటర్లతో పాటు పాత ఓటర్లకు ఎన్నికల అధికారులు అవగాహన కల్పించారు. నిర్భయంగా, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేయడం, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అభ్యర్థులంతా సహకరించడం తదితర అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటు వేయడానికి వెళ్లేటప్పుడు ఓటరు ఓటు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, సర్వీస్ ఐడీ కార్డు(ప్రభుత్వం జారీ చేసినది), ఫొటోతో బ్యాంకు పాస్‌బుక్, పాన్ కార్డు, ఆధార్‌కార్డు తదితర 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకువెళ్లాలి. తీసుకువెళ్లిన కార్డును పోలింగ్ బూత్‌లో ఎన్నికల సిబ్బందికి చూపించాలి.

ఫిర్యాదులకు సీవిజిల్ యాప్

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు సీవిజిల్ అనే యాప్‌ను రూపొందించారు. నియమ, నిబంధనలు అతిక్రమించిన వారిపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి తగు చర్యలు తీసుకుంటారని ఎన్నికల అధికారులు తెలిపారు.

స్లిప్పులు అందకున్నా..కంగారు వద్దు

స్లిప్పులు అందని ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలను కలిస్తే ఓటు వేయడానికి అవసరమైన సహాయం చేస్తారు. డయల్ 1950కి కాల్ చేసి ఓటర్లు వివరాలు తెలుసుకుని ఓటు వేయవచ్చు. అది కూడా కానిపక్షంలో మా కంట్రోల్‌రూమ్‌కి వచ్చి తెలుసుకోవచ్చు. లేదా, బీహెచ్ఏ యాప్ ద్వారా ఓటర్లు వివరాలను పొందవచ్చు. ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

అంతా సైలెన్స్

• ప్రచారాలకు తెర • మౌనం దాల్చిన మైకులు

ఆరిలోవ : మైకుల హోరు.. ఇంటింటి ప్రచారం.. పాటల సందడి సద్దుమణిగింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రచార ఘట్టానికి తెరపడింది. ఎన్నికల నియమావళి ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రచారాలకు స్వస్తి చెప్పారు. పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు మద్యం దుకాణాలను రెండు రోజుల పాటు మూసివేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

ముగిసిన అభ్యర్థుల ప్రచారాలు..

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు చివరిరోజు శనివారం పెద్ద ఎత్తున విస్తృత ప్రచారం చేశారు. 9, 18, 20, 22 వార్డులో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. టీడీపీ అభ్యర్థి వెలగపూడి కూడా పలు కాలనీల్లో ప్రచారం చేశారు.

రోడ్డెక్కిన వెలగపూడి కార్యకలాపాలు



వెలగపూడి కార్యాలయం ఎదుట రోడ్డుపై ఏర్పాటు చేసిన టెంట్లు

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి ఎన్నికల కార్యకలాపాలు రోడ్డెక్కాయి. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ఎంవీపీ కాలనీ సెక్టార్-4లో రోడ్డుపై టెంట్లు వేసి ఇష్టారాజ్యంగా ఆయన ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఆయన ఇష్టారాజ్యంగా రోడ్డును బ్లాక్ చేయడంతో ఇరుగుపొరుగు వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయాన్ని ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా టెంట్లు వేసి ఇష్టారాజ్యంగా ఎన్నికల లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేననే అహంతో వెలగపూడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ పలువురు స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ రోడ్డుపై టెంట్లు వేయడమే కాకుండా, మీటింగ్‌లు, ఎన్నికల లావాదేవీలు నిర్వహిస్తున్న వెలగపూడిపై తక్షణమే ఎన్నికల రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.